

బొడ్రాయి జలనివాస కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి తదితరులు

ఘనంగా బొడ్రాయి పండుగ

హయత్‌నగర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లో బొడ్రాయి పండుగ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాలను ప్రారంభించారు. రాత్రి బొడ్రాయి శిలను పురవీధులల్లో ఊరేగించారు. వేలాది మంది గ్రామస్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం బొడ్రాయిని జలనివాసం చేశారు. హయత్‌నగర్ గ్రామ ప్రజలతో పాటు చుట్టూ ఉన్న కాలనీల మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఇంట్లో నుంచి జలాన్ని తీసుకు వచ్చి బొడ్రాయి జల నివాసంలో పోశారు. మరో పక్క గ్రామ దేవతలకు శాంతి హోమాలను నిర్వహించారు. జలనివాస కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తిరుమల్‌రెడ్డి, ఉత్సవ నిర్వాహకులు రవీందర్‌రెడ్డి, భాస్కర్‌యాదవ్, వెంకటేశ్‌గౌడ్, భిక్షపతి, బలరాం తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఎల్‌బీనగర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కాలనీలలో రోడ్ల ఆక్రమణ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని లింగోజిగూడ కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి ప్రజలకు సూచించారు. డివిజన్ పరిధిలోని సాయిరామ్‌నగర్ కాలనీలో రూ.38 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాప్రభుత్వం ప్రజల కోరిక మేరకు అభివృద్ధి పనులు చేపడుతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, కిరణ్, మాధవరావు, రాజశేఖర్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేటర్ పవన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషి

● **కార్పొరేటర్ పవన్‌కుమార్**

కొత్తపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ హామీనిచ్చారు. ఆదివారం నిర్వహించే పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమానికి ఆశా కార్యకర్తలు శుక్రవారం కార్పొరేటర్‌ను ఆహ్వానించారు. అనంతరం వారి సమస్యలను కార్పొరేటర్‌కు వివరించారు. అధికారులతో మాట్లాడి ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్‌కుమార్, మహేందర్‌యాదవ్ పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై డీడీఆర్‌సీలో అవగాహన

ఎల్‌బీనగర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ సెరిబ్రల్ పాల్సీ దినం, ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం సరూర్‌నగర్‌లోని జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దివ్యాంగులు, మానసిక దివ్యాంగులు వారి తల్లిదండ్రులు, డీడీఆర్‌సీ లబ్ధిదారులకు అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యారోగ్య అధికారి డా.గీత, డీడీఆర్‌సీ నోడల్ అధికారి రమేష్, డీడీఆర్‌సీ రిహాబిలిటేషన్ అధికారి శ్రీవాత్సవ్ తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహారం తీసుకుంటామని ప్రతిజ్ఞ చేస్తున్న గర్భిణులు, బాలింతలు

బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

ఎల్‌బీనగర్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): బాలింతలు, గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సావిత్రి అన్నారు. ఆర్‌కేపురం డివిజన్ ఎన్‌టీఆర్ నగర్‌లో శుక్రవారం సెక్టార్ లెవల్ పోషణ మాసోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు, చిన్న పిల్లలకు అన్నప్రాసన చేశారు. అనంతరం సావిత్రి మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీకేంద్రాల ద్వారా బాలింతలు, గర్భిణులు, బాలింతలకు ఉచితంగా పౌష్టికాహారం అందిస్తున్నాయన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలలో దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు గంగ, సునీత, పుష్పలత, ఆశావర్కర్లు అంజమ్మ, హేమలత పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు 'బీపీడీఏవీ' ఎంపిక

చంపాపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు బీపీడీఏవీ పాఠశాలకు చెందిన విద్యార్థులు నలుగురు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ప్రశాంత్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, మహబూబ్‌నగర్‌లోని డీఎస్‌ఏ స్టేడియంలో ఈ నెల 12 వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు అశ్రిత్, ప్రజ్ఞానంద్, వంశీ, మోక్షిత్‌లు ఎంపికయ్యారని తెలిపారు. బేగంపేట మహర్షి పాఠశాలలో జరిగిన నెట్‌బాల్ సెలక్షన్స్‌లో తమ పాటశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. నెట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల చైర్మన్ మధుబాల, డీఏవీ పాఠశాల ఏఆర్‌ఓ ఆనందవల్లి, ప్రిన్సిపాల్ ప్రశాంత్, ఉపాధ్యాయులు అభినందించారు.



రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ ప్రశాంత్



వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న టీటీఐ ఆర్‌ఎస్‌ఐ సంతోష్‌కుమార్

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి: టీటీఐ అధికారులు

కొత్తపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని టీటీఐ అధికారులు సూచించారు. శుక్రవారం రాచకొండ కమిషనరేట్ పరిధిలోని 16 ప్రాంతాల్లో 631 మందికి ఎస్‌ఐ నర్సింహారావుతో కలిసి టీటీఐ ఆర్‌ఎస్‌ఐ సంతోష్‌కుమార్ అవగాహన కల్పించారు. అదే విధంగా సరూర్‌నగర్‌లోని టానో కిండర్ కేర్ స్కూల్ విద్యార్థులు ఎల్‌బీనగర్ ట్రాఫిక్ కాంప్లెక్స్‌లోని రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కును సందర్శించారు. చిన్నారులకు ఏఎస్‌ఐ సోమ్‌నాథ్, సేఫ్టీ ట్రెయినర్ ప్రవీణ్ ట్రాఫిక్ నిబంధనలను పరిచయం చేశారు. ఏబీసీ ఆఫ్ రోడ్ సేఫ్టీ రూల్స్ బుక్‌లెట్స్‌ను పిల్లలకు అందజేశారు.

హైకోర్టు తీర్పుపై బీసీ నేతల నిరసన

మన్సూరాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడం హేయమని, బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వంతో పాటు అన్ని రాజకీయ పార్టీల నాయకులు కుట్రపూరితంగా మోసం చేస్తున్నారని బీసీ ఉద్యమ నేతలు ఆరోపించారు. హైకోర్టు స్టే విధింపునకు నిరసనగా ఎల్బీనగర్ రింగురోడ్డు వద్ద శుక్రవారం బీసీ ఉద్యమ నేతల ఆధ్వర్యంలో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. వారిని ఎల్‌బీనగర్ పోలీసులు అడ్డుకున్నారు. నిరసనలో బీసీ కులాల సమన్వయ వేదిక అధ్యక్షుడు బొమ్మ రఘురాంనేత, బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం కోర్ కమిటీ సభ్యుడు చామకూర రాజు, గోరా శ్యాంసుందర్‌గౌడ్, బీసీ యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్, కేవీగౌడ్, లింగేష్‌యాదవ్, ఆంజనేయులు, కొండల్‌గౌడ్, శ్రీనివాస్, ఉపేంద్రయాదవ్, రాఘవేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టీఆర్‌పీ ఆధ్వర్యంలో..

బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టేకు కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలే కారణమని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర నాయకుడు కోట్ల వాసుదేవ్ ఆరోపించారు. ఈ మేరకు ఎల్బీనగర్ చౌరస్తా వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మ దహనం చేశారు. వారిని ఎల్‌బీనగర్ పోలీసులు అడ్డుకున్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జానయ్య, టీఆర్‌పీ నాయకులు పాల్గొన్నారు.



జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న బొమ్మ రఘురాంనేత, చామకూర రాజు తదితరులు

హయత్‌నగర్‌లో టీఆర్‌పీ నాయకుల అరెస్ట్

హయత్‌నగర్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) నాయకులు డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లకు బ్రేక్ పడినందుకు గాను టీఆర్‌పీ సీఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేయాలని పిలుపునిచ్చింది. టీఆర్‌పీ పిలుపు మేరకు పార్టీ నాయకులు హయత్‌నగర్ అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. వారిని హయత్‌నగర్ పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో పార్టీ నాయకుడు బొంగు వెంకటేశ్‌గౌడ్, నాయకులు వాసుదేవ్, మహేష్‌గౌడ్, ఈశ్వర్, సీతారాం నాయక్ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చంపాపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): : చంపాపేట సెక్షన్ 11కేవీ సుల్తాన్‌వాల్వా విద్యుత్ ఫీడర్‌లో వివిధ మరమ్మతుల కారణంగా శనివారం మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు డివిజన్ ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. కటికోనికుంట, ఓల్డ్‌చంపాపేట, సాయిరాంకాలనీ, సుల్తాన్‌వాల్వా, బస్తీ దవాఖానా, రాజిరెడ్డినగర్ కాలనీలలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు. అదే విధంగా 11కేవీ కర్మన్‌ఘాట్, సాయిరాంనగర్ విద్యుత్ ఫీడర్లలో శనివారం ఉదయం 11:30 నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు. ఆయా ఫీడర్ల పరిధిలోని గ్రీన్ పార్కుకాలనీ, కర్మన్‌ఘాట్, సాయిరాంకాలనీ, నిర్మలానగర్, హనుమాన్‌నగర్, సాయిరాంనగర్ కాలనీలలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గణపతి హోమం

కొత్తపేట: విజయ గణపతి ఆలయంలో సంకట హర చతుర్థి సందర్భంగా అర్చకులు భక్తి శ్రద్ధలతో గణపతి మూల మంత్ర హోమం నిర్వహించారు. తొలుత మండపారాధన నిర్వహించారు. అనంతరం విజయ గణపతి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో స్నేహపురి కాలనీ భక్తులు పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి

● **జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి**

చంపాపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, బీజేపీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డిలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం హస్తినాపురం చౌరస్తాలో బీజేపీ అర్బన్ జిల్లా కార్యదర్శి నరేశ్‌యాదవ్ 48 గంటల నిరాహార దీక్షను చేపట్టారు. ఈ దీక్షా శిబిరాన్ని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి సందర్శించి నరేశ్‌యాదవ్‌కు పూలమాల వేసి నిరాహార దీక్షను ప్రారంభించారు. అనంతరం రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ మెంబర్ చిట్టిప్రోలు రవికుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కుట్ర పూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థులకు రావాల్సిన రూ.8వేల కోట్ల పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్‌పాల్‌గౌడ్, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు దుర్గయ్యగౌడ్, డివిజన్ అధ్యక్షుడు క్రాంతిగౌడ్, కిరణ్‌కుమార్, విష్ణువర్ధన్, బీజేపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, నర్సింహారావు, అవినాష్‌రెడ్డి, రోజా, కిరణ్‌రెడ్డి, మల్లేష్‌యాదవ్, రాఘవేంద్రయాదవ్, అనిల్ మధుకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ నేత నరేశ్‌యాదవ్ చేపట్టిన నిరాహార దీక్షను ప్రారంభిస్తున్న పార్టీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

రేపు పల్స్ పోలియో

ఓల్డ్‌మలకపేట, అక్టోబర్ 10 (ఆంధ్రజ్యోతి): అప్పుడే పుట్టిన శిశువు మొదలుకుని ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని మలక్‌పేట అర్బన్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డా. శ్రీలక్ష్మి తెలిపారు. ఈ నెల 12న నిర్వహించే పల్స్ పోలియో ఏర్పాట్లపై శుక్రవారం హైదరాబాద్ డీఎంహెచ్‌ఓతో వీడియోకాల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మలక్‌పేట యూపీహెచ్‌సీ పరిధిలో పల్స్ పోలియో నిర్వహణకు ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 7నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్దేశించిన పోలియో బూతుల్లో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తారన్నారు. అదేవిధంగా 13, 14, 15 తేదీల్లో వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేస్తారన్నారు. మలక్‌పేట యూపీహెచ్‌సీ పరిధిలో ఐదు సబ్‌సెంటర్లలో మొత్తం 39 పోలియో బూతులు ఏర్పాటు చేశామని చెప్పారు. ఐదేళ్ల లోపు 8,895 మంది చిన్నారులు ఉన్నట్లు గుర్తించామని, వారందరికి పోలియో చుక్కలు వేయనున్నట్లు ఆమె తెలిపారు. సమావేశంలో ఎంపీహెచ్‌ఎన్ రామేశ్వరి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



హయత్‌నగర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు తాళపత్ర గ్రంథం అందజేస్తున్న పిన్నోజు మల్లాచారి

తాళపత్ర గ్రంథం బహూకరణ

హయత్‌నగర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డిగ్రీ కళాశాల గ్రంథాలయానికి పిన్నోజు మల్లాచారి తాళపత్ర గ్రంథాన్ని శుక్రవారం బహూకరించారు. ఈ గ్రంథానికి 120 సంవత్సరాల చరిత్ర ఉందని ఆయన తెలిపారు. తాళపత్ర గ్రంథంలో ప్రధానంగా శివుడు, నారాయణుడి పట్ల భక్తి, ఆచారాలు వివరించబడ్డాయని మల్లాచారి తెలిపారు. తాళపత్ర గ్రంథాన్ని బహూకరించిన పిన్నోజు మల్లాచారిని ప్రిన్సిపాల్ సురేశ్‌బాబు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకుడు దుర్గాప్రసాద్, చరిత్ర విభాగం గంగాధర్, వెంకటేశ్వర్లు, యాదగిరిరెడ్డి, అనిత, ఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి

● **రాచకొండ ఏహెచ్‌టీయూ అధికారులు**

కొత్తపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సోషల్‌మీడియాకు దూరంగా ఉండాలని రాచకొండ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఏహెచ్‌టీయూ) ఏఎస్‌ఐ అనురాధ, ఎస్‌పీఓ అరుణారెడ్డిలు అన్నారు. శ్రీచైతన్య జూనియర్ కళాశాల ఎల్‌బీనగర్ జోనల్ క్యాంపస్‌లో శుక్రవారం ఏహెచ్‌టీయూ అధికారులు విద్యార్థులకు పలుఅంశాలపై అవగాహన కల్పించారు. సోషల్ మీడియా వేదికల్లో అపరిచితులతో వ్యక్తిగత సమాచారం పంచుకోరాదని వారు తెలిపారు. అపరిచితులు పంపే లింకులను ఓపెన్ చేయొద్దని సూచించారు. ప్రయాణ సమయంలో ఏమైనా సమస్య ఎదురైతే టీ సేఫ్ అప్లికేషన్ ఉపయోగించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రూప, వైస్ ప్రిన్సిపాల్ హృషిత పాల్గొన్నారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

హయత్‌నగర్: ఉరేసుకుని మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన హయత్‌నగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా ఎన్ అన్నారం గ్రామానికి చెందిన గందమల్ల వసంత(40) భర్త జయరాజ్ దంపతులు కొంత కాలంగా పెద్దఅంబర్‌పేట్‌లోని యూనికార్ఫస్ వార్డ్ అండ్ డీడ్ ఆస్పత్రి క్వార్టర్స్‌లో నివాసముంటున్నారు. జయరాజ్ యూనికార్ఫస్ వార్డ్ అండ్ డీడ్ ఆస్పత్రిలో పని చేస్తున్నాడు. భార్య ఇంటి వద్దే ఉంటుంది. కొంత కాలంగా వసంత మానసికంగా ఇబ్బందులు పడుతుంది. ఇదిలా ఉండగా గురువారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఇంట్లో ఫ్యానుకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. వెంటనే కుటుంబ సభ్యులు స్థానిక ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వసంత శుక్రవారం సాయంత్రం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. భర్త జయరాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హయత్‌నగర్ పోలీసులు తెలిపారు.

పొరుగింటి వారితో గొడవ

● **నిందితునికి ఐదు రోజుల జైలుశిక్ష**

చాదర్‌ఘాట్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పొరుగింటి వారితో గొడవ పడిన యువకునికి నాంపల్లిలోని 7వ మెట్రో పాలిటన్ స్పెషల్ మెజిస్ట్రేట్ ఐదు రోజుల జైలు శిక్ష విధించారు. మలక్‌పేట సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. అఫ్జల్‌నగర్ ప్రాంతానికి చెందిన రితీష్ (23) చిన్న విషయంలో పక్కింటి వారితో గొడవ పడ్డాడు. ఈ మేరకు అతనిపై మలక్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్ తరలించారు. కేసు వివరాలను పరిశీలించిన 7వ మెట్రో పాలిటన్ స్పెషల్ మెజిస్ట్రేట్ నిందితుడు రితీష్‌కు ఐదు రోజుల జైలు శిక్షను విధిస్తూ తీర్పు నిచ్చినట్లు సీఐ తెలిపారు.

యూరియా వాడకాన్ని తగ్గించాలి

● **వ్యవసాయ శాస్త్రవేత్తలు**

● **కోహెడలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్త కార్యక్రమం**

హయత్‌నగర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పంటలకు యూరియా వాడకాన్ని తగ్గించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని కోహెడలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్త అనే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు పంట పొలం వద్దకు వచ్చి వ్యవసాయ అధికారులు, రైతులతో సమావేశమయ్యారు. వరి పంటలో ఎలుకల నివారణ, పంట మార్పిడి, పంటకు యూరియా, పొటాష్ వాడే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం అబ్దుల్లాపూర్‌మెట్ మండల వ్యవసాయ అధికారి పల్లవి మాట్లాడారు. ఈ సంవత్సరం రైతులు 25 శాతం యూరియా వాడకాన్ని తగ్గించారని అన్నారు. కొంత మంది రైతులు వర్షా కాలాన్ని పురస్కరించుకుని జీలుగ, జనుమును సాగు చేశారన్నారు. సబ్సిడీపై రోటవేటర్, స్పేయర్‌లు అందుబాటులో ఉన్నాయని ఏఓ పల్లవి తెలిపారు. అనంతరం వ్యవసాయ విశ్వవిద్యాలయం అందించిన నాణ్యమైన విత్తన సాగును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డా.సునీత, శ్రీనివాస్‌రెడ్డి, 45 మంది రైతులు పాల్గొన్నారు.



పంట మార్పిడిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు

కుంట్లూరులో గాంధీ లక్ష విగ్రహాల కార్యక్రమం

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గాంధీజీ లక్ష విగ్రహాల కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీజ్ఞాన్ ప్రతిష్ఠాన్ సంస్థల చైర్మన్ రాజేందర్‌రెడ్డి కోరారు. ప్రజల మద్దతుతో గాంధీ లక్ష విగ్రహాల కార్యక్రమం సామూహిక ఉద్యమంగా రూపుదిద్దుకుంటుందన్నారు. శుక్రవారం కుంట్లూర్‌లోని గాంధీయన్ బీఈడీ కళాశాలలో గాంధీజీ అక్షరాలపై ఏర్పాటు చేసిన విగ్రహాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ, నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న విపత్కర పరిస్థితులకు గాంధీ సిద్ధాంతాలే శరణ్యమని, ఈ సందేశాన్ని యువతతో పాటు రాబోవు తరాలకు తెలియజేసేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లోని టేబుళ్లపై గాంధీ విగ్రహాలు ఉండేలా పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ ఆర్థిక సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ సంస్థల వైస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ప్రభాకర్, సుభాష్‌చంద్ర, నాగేశ్వరరావు, శ్రీనివాస్‌గౌడ్, హరిదీప్‌రెడ్డి, దొరబాబు, ప్రేమ్‌కుమార్, కృష్ణయ్య, సతీష్, పవన్, సాయి, వినోద్ పాల్గొన్నారు.

రేపు పద్మశాలీల దసరా మేళా

మన్సూరాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ సర్కిల్ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించే పద్మశాలీ దసరా మేళాలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పద్మశాలీలు పాల్గొని జయప్రదం చేయాలని సంఘం ఎల్బీనగర్ సర్కిల్ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత పిలుపునిచ్చారు. ఈ మేరకు మన్సూరాబాద్‌లోని హరిణవనస్థలి అనన్య ఎకో పార్కు ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ నగరంలోని వనస్థలిపురం హరిణవనస్థలి అనన్య ఎకో పార్కు ఆవరణలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ మేళాను నిర్వహించనున్నామని తెలిపారు. ఈ మేళాకు ముఖ్యఅతిథులుగా మాజీ రాజ్యసభ సభ్యుడు ఆనంద్‌భాస్కర్, సంగారెడ్డి ఎమ్మెల్యే ప్రభాకర్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, వరంగల్ మేయర్ సుధారాణి హాజరుకానున్నట్లు గణేష్‌నేత తెలిపారు.

గుండెపోటుతో రిటైర్డ్ హెచ్‌ఎం మృతి

● **నివాళులర్పించిన విద్యార్థులు**

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బండరావిరాల ఉన్నత పాఠశాలకు చెందిన రిటైర్డు హెచ్‌ఎం మనోహర్ గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు శుక్రవారం హయత్‌నగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి మనోహర్ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాగా మనోహర్ 2018 నుంచి 2024 వరకు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బండరావిరాల జడ్పీహెచ్‌ఎస్‌లో హెచ్‌ఎంగా విధులు నిర్వహించారు.

సీనియర్ సిటిజన్లను గౌరవించాలి: సీపీ సుధీర్‌బాబు

మన్సూరాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్ల అనుభవం రేపటి సమాజానికి మార్గదర్శకమని, వారిని గౌరవించుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు అన్నారు. నాగోల్ డివిజన్ పీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్(ఆర్‌ఎస్‌సీ) ఆధ్వర్యంలో కామినేని ఆస్పత్రి సహకారంతో సీనియర్ సిటిజన్లకు 'గోల్డెన్ కేర్ హెల్త్ క్యాంపును శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీపీ సుధీర్‌బాబు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. రాచకొండ కమిషనరేట్‌లోని 47 పోలీస్‌స్టేషన్లలో ఒంటరిగా ఉన్న వయోవృద్ధులను 470 మందిని గుర్తించి వారికి అవసరమైన సహకారం అందించి తామున్నామనే భరోసా కల్పిస్తున్నామన్నారు. ప్రతీ నెల తమ కమిషనరేట్ పరిధిలోని మల్కాజిగిరి, ఎల్బీనగర్, భువనగిరి ప్రాంతాల్లో సీనియర్ సిటిజన్లకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాని తెలిపారు. సీనియర్ సిటిజన్లు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీపీ కోరారు. కామినేని ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచితంగా బీపీ, షుగర్, గుండె, దంత సంబంధిత వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఎల్బీనగర్ కామినేని ఆస్పత్రి మార్కెటింగ్ ఉపాధ్యక్షుడు ఏఆర్‌ఎస్ సత్యనారాయణ తెలిపారు. అదే విధంగా సొలిస్ ఐకేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ డీసీపీ అనురాధారెడ్డి, ఉమెన్ సేఫ్టీ డీసీపీ ఉషారాణి, ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసులు, అదనపు డీసీపీ కోటేశ్వరరావు, ఆర్‌కేసీ సావిత్రి, ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, నాగోల్ సీఐ మక్బూల్ జాని, షీటీం సీఐ ముని, ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు



జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలియజేస్తున్న ముసారాంబాగ్ బ్రిడ్జి బాధిత కుటుంబీకులు

బ్రిడ్జి నిర్మాణాన్ని నాలుగు లైన్లకు కుదించాలి: బాధితులు

● **జీహెచ్‌ఎంసీ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో నిరసన**

చాదర్‌ఘాట్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ముసారాంబాగ్ కొత్తగా నిర్మించనున్న హైలెవల్ బ్రిడ్జి నిర్మాణాన్ని ఆరు లైన్ల నుంచి నాలుగు లైన్లకు కుదించాలని ఇళ్లను కోల్పోతున్న బాధితులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. అనంతరం విర్గో వెల్ఫేర్ అసోసియేషన్‌కార్యదర్శి రాజశేఖర్‌తో కలిసి బాధిత కుటుంబీకులు జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ ముసారాంబాగ్ నూతన బ్రిడ్జి నిర్మాణంతో దాదాపు 50ఇళ్లు పూర్తిగా కోల్పోయే ప్రమాదముందన్నారు. బాధిత కుటుంబీకుల బాధలను గుర్తించి జీహెచ్‌ఎంసీ సానుకూలమైన నిర్ణయం తీసుకోవాలని ఆయన జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను కోరారు.